## మినీ కథ




ఆ రోజు భారత్-ఆస్ట్రేలియా క్రికెట్ జట్ల మధ్య 'ఒకరోజు అంతర్జాతీయ పోటీ' జరుగుతోంది. ఆ స్టేడియం క్రికెట్ అభిమానులతో క్రిక్కిరిసి వుంది. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో కేంద్రాలు ప్రత్యక్ష వ్యాఖ్యానం నిర్వహిస్తున్నాయి.

ఆట ప్రారంభంలో ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్ టాస్ గెలిచి భారత్‌ను బ్యాటింగ్ చేయమని కోరాడు. భారత్ జట్టు ఆట ప్రారంభించి గంట పూర్తయింది. గంటలో భారత్ 16 ఓవర్లలో 72 పరుగులు చేసి 4 వికెట్లు కోల్పోయింది. గంట సేపయినందున అంపైర్ టీ బ్రేక్ ప్రకటించారు.

అంతవరకు ఆటని స్పాన్సర్ చేసిన ఓ కంపెనీ ప్రకటన పూర్తికాగానే దూరదర్శన్ కామెంటేటర్లు ఆటను గురించి దేశవ్యాప్తంగా టి.వి. చూస్తున్న ప్రేక్షకులకు వివరిస్తూ వున్నారు. ఇంతలో టి.వి. కెమెరా ఓ చోట ఒక అట్ట బ్యానర్ చేతపుచ్చుకుని నిలబడ్డ వ్యక్తిపై నిలిచింది. క్రికెట్ ఆట చూసే ప్రేక్షకులు తమ వుద్దేశాలు అలా అట్ట బ్యానర్లపై రాసి అందరికీ తెలిసేలా పట్టుకోవడం, అది టి.వి. కెమెరాలో చూపడం పరిపాటే. కాని, ఈసారి ఆ అట్టమీద రాసివున్న మాటలు టి.వి. కామెంటేటర్లను, ప్రేక్షకులను కూడా ఆశ్చర్యంలో ముంచెత్తాయి. ఆ చుట్టు ప్రక్కల కూర్చుని వున్న ప్రేక్షకులు కూడా ఆ వ్యక్తినే చూడసాగారు లేచి నిలబడి మరీ! ఇంతకీ ఆ అట్ట మీద వున్నదేమిటంటే—

*"బ్రింగ్ బ్యాక్ బాలాజి", "నో బాలాజి, నో ఇండియా" (బాలాజీని వెనక్కు పిలవండి. బాలాజీ లేకపోతే భారతదేశమే లేదు)* అని వుంది. అదే ఆశ్చర్య కారణం అయింది. ఎందుకంటే, భారత క్రికెట్ చరిత్రలో బాలాజీ అనే క్రీడాకారుడు లేడు. వున్నా టెస్టు చరిత్రలో ఆడలేదు. అశేష అనుభవం వున్న టి.వి. కామెంటేటర్లు, రేడియో కామెంటేటర్లు గత చరిత్ర అంతా తిరగదోడసాగారు. అయినా, ఆ బాలాజీ ఎవరో క్రికెట్‌లో తల పండినవారికీ అర్థం కాలేదు. అనుమానంతో కెమెరాను జూమ్‌చేసి ఆ వ్యక్తి పిచ్చివాడేమోనని చూసారు. అతని వయస్సు పాతికేళ్ళు. పిచ్చి లక్షణాలేం లేవు. నవ్వు ముఖంతో బ్యానర్‌ని కెమెరాకు కనబడేలాగా పట్టుకున్నాడు. దేశవ్యాప్తంగా సంచలనం ఇలా వుండగా, ప్రఖ్యాత దినపత్రికా విలేకరులు, ఫోటోగ్రాఫర్లు, ఆట గురించి వ్రాసేందుకు వచ్చిన వాళ్ళంతా ఆ అట్టని చూసారు. ఓ విలేకరి ఫోటో తీసుకున్నాడు. కొందరు అతని దగ్గరికి చొచ్చుకుని పోయారు. వారిలో ఓ వ్యక్తి "ఎవరా బాలాజీ? ఎప్పుడు ఇండియా జట్టులో ఆడాడు?" అని ప్రశ్నించాడు. ఆ వ్యక్తి కులాసాగా నవ్వేస్తూ విలేకరులతో, "టి.వి.లో కనబడేందుకు ఎన్నో మ్యాచ్‌లలో పిచ్చి డాన్సులతో, రకరకాల విన్యాసాలతో, వింత గెటప్‌లతో ఎందరో వింత గొలపడం ఇంతవరకు మీకు తెలుసు. నేనూ ఏదో ఓ రకంగా టి.వి.కి ఎక్కాలనుకున్నాను. కష్టపడి ఆలోచించి ఇలా చేసాను. ఈ బ్యానర్ మీద వున్న 'బాలాజీని నేనే" అన్నాడు నవ్వుతూ. అంతా ఆశ్చర్యపోయారు. కొందరు వెధవ చేష్టలు అని తిట్టుకున్నారు. కొందరు నవ్వుకున్నారు. అంతా వారి వారి స్థలాలలోకి పోయి కూర్చున్నారు. టి.వి. ఎక్స్‌పర్ట్ కామెంటేటర్ అంతా విని నవ్వుతూ ఆ విషయాన్ని టి.వి. ద్వారా చెప్పి సహ కామెంటేటర్లతో కలిపి నవ్వుకుని తర్వాత ప్రారంభమైన ఆటమీద దృష్టి నిలిపారు.

*[క్రికెట్ మ్యాచ్‌లకి వెళ్ళి రకరకాల వింత చేష్టలతో టి.వి. కెమెరా దృష్టిలో పడాలనుకునే ఎందరో ప్రేక్షకులను చూసాక ఈ కథ ఇలా రాసాను. ఆ ప్రేక్షకులే ప్రేరణ కనుక వారికే ఈ కథ అంకితం.]*

—పి.వి. రవికుమార్


ఆంటన్ చెకోవ్ వ్రాసిన చెర్రీ ఆర్చర్డ్
ప్రపంచప్రఖ్యాత నాటకానికి
.... తెలుగు అనుసరణ ....
శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు
'సువర్ణరేఖలు'
వచ్చేవారమే ప్రారంభం